# సీసా పాతదే!

వాసిరెడ్డి సీతాదేవి



ఆకాశంలో వెలుగు పూర్తిగా ఆరి పోలేదు.

అయినా వీధిదీపాలు వెలిగాయి.

రకరకాల వాహనాలు రోడ్లమీద వింత ధ్వనులుచేస్తూ పరుగులు తీస్తున్నాయి.

పేవ్‌మెంటుమీద జనం పరుగు పందెంలో వెనకపడిపోతామేమో అన్నట్టు, ప్రతిఒక్కడూ, పక్కనే నడిచే రెండోవాడిని దాటిపోవడానికి ప్రయత్నిస్తున్నాడు. కాని రామస్వామి అందర్నీ చూస్తూ, తాపీగా, బద్ధకంగా, ఓ గమ్యం అంటూ లేనివాడిలా నడుస్తున్నాడు. తనలా బద్ధకంగా, తాపీగా నడిచే వాళ్లు కన్పించలేదు అతనికి.

బస్‌స్టాండు దగ్గర ఆగాడు. అక్కడ కిక్కిరిసిఉన్న జనాన్ని చూసి 'గండు చీమలపుట్ట పగిలినట్టు ఉంది' బస్‌స్టాండు అనుకున్నాడు.

అందరూ ఆత్రంగా బస్‌కోసం ఎదురు చూస్తున్నారు. కొందరి చేతుల్లో పుస్తకాలుంటే, మరికొందరి చేతుల్లో చిన్నా, పెద్దా ప్యాకెట్లు ఉన్నాయి.

డబల్‌డెక్కర్ నిండు చూలాలులా బరువుగా వస్తోంది. అది బస్‌స్టాండులో ఆగబోతున్నట్టే కన్పించి, అంతలోనే స్పీడు అందుకొని ముందుకు సాగిపోయింది. దానికోసం పరుగుతీసినవాళ్లు, మళ్లీ వెనక్కువచ్చి బస్‌స్టాండులో నిల్చున్నారు.

ఒక యువతి బస్‌స్టాండు వెనకఉన్న గోడకు చేరబడి వారపత్రిక చదువుతోంది.

ఏం చదువుతుందో? తన ఆరాధ్య రచయిత్రి సీరియల్ కాబోలు అంత దీక్షగా చదువుతోంది. రామస్వామికి కూతురు గుర్తొచ్చింది. లావణ్య ఆఫీసు నుంచి బయలుదేరి ఉంటుందా? ఆ అమ్మాయి పెళ్లి కాలేదేమో! అంత తాపీగా పత్రిక చదువుకుంటూ నిల్చున్నది. ఎంత నిశ్చింతగా ఉందో? పెళ్లి కాలేదు—అందుకే నిశ్చింతగా తనలోకంలో ఉన్నది.

హైదరాబాద్ వాతావరణం పూర్తిగా మారిపోయింది. తను ఈ ఊరు వచ్చిన కొత్తలో ఇంతజనం, ఇన్ని వాహనాలు, కన్పించేవికావు. ఏడు అయేసరికి, ముఖ్యంగా చలికాలం, రోడ్లమీద జనం చెదురుమదురుగా కన్పించేవారు.

నవంబరు నెల వచ్చిందంటే చాలు, బస్‌కండెక్టర్ల నుంచి ప్రతి ఒక్కరూ ఉన్నిదుస్తుల్లో కన్పించేవాళ్లు. శేర్వాణీలు ఎక్కువ కన్పించేవి. స్వెట్టర్లూ, భుజాల మీదగా శాలువాలూ కన్పించేవి. ఆ చలి ఏమైందో ఇప్పుడు?

జనం పెరిగారు

భవనాలు పెరిగాయి.

నగరం పెరిగిపోతున్నది.

ఇండస్ట్రీస్ పెరిగాయి. వాటి గొట్టాల నుంచి వచ్చే వేడి హైదరాబాద్ చలిని చాలావరకు మింగేసిందంటారు.

కాస్తో కూస్తో మిగిలిఉంటే, అది పేవ్‌మెంటుమీద బతికే దరిద్రుల కడుపుల్లో దాక్కొని ఉంటుంది—

రామస్వామి ఓ క్షణం నిల్చుని పేవ్‌మెంటుమీద మూడంకెవేసి పడుకుని ఉన్న వృద్ధ బిచ్చగాడిని చూశాడు.

పేవ్‌మెంటుమీద వచ్చేపోయే జనం తనకేసి వింతగా చూడటం, దాటిపోయాక తిరిగి తిరిగి చూడటం, రామస్వామికి ఆశ్చర్యాన్ని కలిగించింది.

తనను ఎందుకలా చూస్తున్నారు?

తను బిచ్చగాడిని చూస్తూ నిల్చుండిపోయాడు,

అతని ముందుఉన్న చిరిగిన గోనెపట్టామీద తెల్లగా ఐదుపైసల, పది పైసల బిళ్లలు దీపాలకాంతిలో మెరుస్తున్నాయి! అదా సంగతి! వాళ్లు తను ఆ డబ్బు కొట్టెయ్యడానికి చూస్తున్నాడనుకొంటున్నారు. అందుకే అలా తిరిగితిరిగి చూస్తున్నారు.

రామస్వామి పెదవులమీద చిరునవ్వు ఓ క్షణం కదిలి, అక్కడ నిలబడలేనట్టు అంతలోనే జారిపోయింది. అవును! ఈ రోజుల్లో దొంగ ఎవరో, దొర ఎవరో తెలుసుకోవడం కష్టమే!

రామస్వామి 'బాగేఅమీ'లోకి అడుగు పెట్టాడు. అతను ఎన్ని ఆలోచనల్లో ఉన్నా అతనికాళ్లు అలవాటు ప్రకారం పబ్లిక్‌గార్డెన్స్‌కేసే నడుస్తాయి. శాసన సభా భవనంకేసి చూశాడు. హడావిడిగా

లేదు. పెషన్స్ నిన్ననే ముగిసినట్టుంది! అందుకే కార్లు లేవు. పైరవీకార్లు, ధోవతులవాళ్ళు కన్పించడంలేదు.

రెండు అడుగులు ముందుకువేశాడు. జూబ్లీహాలుముందు ప్రభుత్వ వాహనాలు ఉన్నాయ్. ఆఫీసర్ల మీటింగు కాబోలు అనుకుంటూ రోజ్‌గార్డెన్స్‌కేసి నడవసాగాడు.

రోజ్‌గార్డెన్‌కు దూరంగా చెట్టుకింద ఉన్న బెంచీమీద కూర్చున్నాడు.

అతను రోజూ ఆ బెంచీమీదే కూర్చుంటాడు. ఆ బెంచీతో అతనికి ఏదో అనుబంధం ఉన్నట్టు అనిపిస్తుంది. అతను వచ్చేసరికి, ఎవరైనా ఆ బెంచీని ఆక్రమించుకుంటే, మిత్రద్రోహిని చూసినట్టు, ఆ బెంచీని చూస్తాడు.

ఆ బెంచీకి కొంచెం దూరంలో కూర్చుని ఎప్పుడు అది ఖాళీఅవుతుందా అని చూస్తాడు.

ఒకరోజు ఆ బెంచీమీద కూర్చునే చూశాడు – చెట్టంత మనిషి, ఎదురుబెంచీమీద ఒకసారి వాంతిచేసుకొని, విరుచుకు పడిపోయాడు. హార్ట్ఎటాక్ అట! హాస్పటల్‌కు కూడా వెళ్ళాల్సిన పనిలేక పోయింది. నేరుగా అక్కడికే – ఉండేది అద్దెకొంపట! శవాన్ని తీసుకురావద్దన్నారట ఇంటివాళ్ళు.

చదువు పూర్తిచేసి ఉద్యోగ ప్రయత్నంలో ఈ ఊరు వచ్చాడు. నిరుద్యోగిగా ఈ బెంచీమీద కూర్చుని బాధపడ్డాడు. భవిష్యత్తుగురించి ఎన్నో కలలు కూడా కన్నాడు. కన్నీరు కార్చాడు. చేదు అనుభూతులూ, మధుర అనుభూతులూ – అన్నీ ఈ బెంచీతోనే పంచుకున్నాడు. ఉద్యోగం వచ్చింది.

ఆ రోజు వచ్చి ఆ బెంచీమీద కూర్చున్నాడు. తన ఆనందాన్ని ఆ బెంచీకూడా పంచుకున్నట్టే అనిపించింది.

భార్యతో కొత్తగా కాపరంపెట్టిన రోజుల్లో, ఇద్దరూ ఈ బెంచీమీద కూర్చుని ఎన్నో కబుర్లు చెప్పుకున్నారు. కలలు కన్నారు. ఆ రోజులే వేరు. చుట్టూ ఇంద్రధనస్సు రంగులే కన్పించేవి. ఇద్దరే. ఆ జీతమే ఎక్కడిదొక్కడిగా ఉండేది. బాధ్యతలు లేవు. షికార్లు – సినిమాలు. గీతకళ్లలో తనంటే ఆరాధ్యభావం – ముఖంలో అమాయకత్వం –

ఈనాటి గీత! ఆ కళ్ళలో ఆ ఆరాధన ఏమైంది?

ఆలోచిస్తూ వెనక్కివాలి, బెంచీచేతిమీద చెయ్యివేశాడు. అరచేతికి ఏదో చల్లగా జిగురుగా తగిలింది. అరచెయ్యి చూసుకున్నాడు. పిట్టరెట్ట తెల్లగా, జిగురుగా అతుక్కొని ఉంది.

బెంచీకివేసి చేతిని రుద్దాడు. ఆ జిగటకు బెంచీ మురికి అంటింది. వంగి కింద ఉన్న ఆకుల్ని ఏరాడు. ఆకులతో చేతిని తుడుచుకున్నాడు. అయినా అరచెయ్యి జిగురుగానే ఉంది. చీదరగా ఉంది.

పక్క బెంచీనుంచి కిలకిల నవ్వు విన్పించింది. తిరిగి చూశాడు. ఒక పడుచుపిల్ల మీదకు వంగి, ఒక నవయువకుడు–ఆమె భర్త కావచ్చు – ఏదో అంటున్నాడు. ఆమె నవ్వుతోంది.

రామస్వామి చూపులు తిప్పుకున్నాడు.

తనలో వచ్చిన మార్పుకు తనకే ఆశ్చర్యంగా ఉంది.

ఒకప్పుడు ఇలాంటి జంటల్ని కుతూహలంగా చూసేవాడు. కళ్ళప్పగించి చూసేవాడు వాళ్ళు చూడనప్పుడు. దొంగ చూపులు చూసేవాడు వాళ్ళు తనకేసి చూస్తున్నప్పుడు.

ఉద్యోగంలేనిరోజుల్లో, అర్ధాకలితో ఉన్నరోజుల్లో కూడా తనలో ఏదో బలమైన జంతువు ఉన్నట్టు అన్పించేది. ఆ జంతువు ఆకలితో అశాంతిగా తిరిగేది. ఇప్పుడు తనలోని జంతువు చచ్చిపోయింది. అది పూర్తిగా చచ్చిపోయి మూడేళ్ళు దాటిపోయింది. అది చావలేదు. తనభార్య దానిని చంపింది.

తన మనసు తామరాకుమీద నీటిబొట్టులా తయారైంది. అన్నింటికీ అతీతంగా ఎదిగిపోయింది.

ఏమో!

తనకు దేన్నిగురించీ విచారంలేదు. ఆఫీసుకు ఆలస్యంగా వెళ్తే బాస్ తిడతాడనే భయంలేదు. డి.ఏ. పెంచారాలేదా అనే బెంగకాదు. ప్రమోషన్ కోసం కాకాపట్టే అవసరంలేదు.

రామస్వామి కళ్ళముందు భార్య రూపం కదిలింది.

తాను ఇప్పుడు ఎవరికీ భయపడటం లేదా? గీత అంటే తనకు భయం! ఆమె ముఖంలోకి చూడాలంటే భయం! ఆమెను పలకరించాలంటే భయం. ముఖ్యంగా ఆమె కళ్ళంటే మరీ భయం.

తనలోని పురుష అహంకారం చచ్చిపోయి చాలాకాలం అయింది.

"పక్కింటి సుబ్బారావును చూసైనా నేర్చుకో! నలుగురు ఆడపిల్లల్ని కన్నావ్. నువ్వొక్కడివీ మడికట్టుకు కూర్చుంటే దేశంలో లంచగొండితనం పోతుందా? ఆ సుబ్బారావుపెళ్ళాం రాళ్ల నెక్లెసు చేయించుకుంది."

"నీకూ చేయిస్తాలే!"

"అయ్యో! రాత! అంతమాత్రమా?"

అంటూ గీత పైఅదా బొత్తిగాలేదని రోజూ దెప్పిపొడిచేది. తనను చేతకానివాడికింద కట్టేసేది.

పెళ్లయిన కొత్తలో గీత తనభార్య అనుకునేవాడు. కాలక్రమేణ తను "గీతకు భర్త" అనే భావం కలగసాగింది. ఆ భావం క్రమంగా ధృఢపడింది.

గీత భర్తగా ప్రవర్తించి ఆమె మెప్పును పొందాలనుకున్నాడు. చివరకు ధైర్యంచేశాడు. ఆ రోజు ఏభైరూపాయలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. అదే తను మొదటిసారి, చివరిసారిగా తీసుకున్న లంచం, బొత్తిగా అనుభవం లేని వ్యవహారం. కొన్ని సంవత్సరాలు

సస్పెన్షన్‌లో ఉన్నాడు. అప్పుడు అలవెన్సు వచ్చేది. సగం జీతమే కావచ్చు. ఆఫీసుకు వెళ్ళకుండా వచ్చే డబ్బు! తనకు అదే బాగుంది అని అన్పించేది.

గీత చూపుల్ని ఎదుర్కోవడం ఒక్కటే తనకు కష్టంగా ఉండేది.

ఆమె చూపుల్లో నిరసనభావం కన్పించేది. ఒకోసారి ఆ చూపులు తనను కాల్చడానికి సిద్ధంగా ఉన్నట్టు అన్పించేవి.

ఇప్పుడు? పాపం! ఆ కళ్ళకు ఆ శక్తి లేదు. ఒకనాడు కాంతిరేఖలు కదులుతూ కన్పించిన ఆ కళ్ళల్లో ఎడారిలోని శూన్యం ప్రవేశించింది.

ఆ కళ్ళు ఇప్పుడు ఏ భావాన్నీ ప్రకటించలేవు.

తన ఉద్యోగం పోయింది.

తన పెద్దకూతురు లావణ్య కుటుంబ భారాన్ని తనభుజాలమీదకు తీసుకుంది. లావణ్యకు తనంటే జాలి. తల్లి చూడకుండా నెలకు ఐదో పదో తనచేతిలో పెడుతుంది. ఉదయం గొంతులో ఇన్ని మెతుకులు వేసుకొని ఇంటినుంచి బయట పడ్తాడు. రాత్రి అందరూ నిద్రపోయాక ఇంటికి చేరతాడు. ఇలా బ్రతుకుతున్నందుకు తనకు పెద్దబాధగా లేదు. పైగా అలవాటైపోయింది. ఇప్పుడు ఏ కంపెనీలోనైనా ఉద్యోగం వచ్చినా తను కుదురుగా సీటుకు అంటుకుపోయి కూర్చోలేడు!

ఈ మధ్య గీత తనతో బొత్తిగా మాట్లాడటం మానేసింది. ఉద్యోగం పోయిన కొత్తలో "ఇలా ఆడపిల్ల సంపాదన తింటూ ఊరంతా బలాదూర్ తిరగడానికి సిగ్గువెయ్యడం లేదూ? నువ్వేం మగవాడివి? ఏదో ఒక పని చూసుకోలేవూ?" అంటూ ఉండేది తన భార్య.

ఆడది అందునా భార్య, మగవాడిని అందునా భర్తని అనకూడని మాట— "నువ్వేం మగవాడివి" .... అనేకసార్లు అన్నది.



అయినా తను తాపీగానే వినగలిగాడు. ఆ మాటలు వింటూనే అన్నం తినేవాడు. తనలో ఏదో చచ్చిపోయింది. పూర్తిగా చచ్చిపోయింది. ఏమిటి అది? పురుష అహంకారమా? ఆత్మాభిమానమా?

పెళ్ళయిన కొత్తలో తనకు కోపం వస్తే గీత ఎంత బెదిరిపోయేది? పెద్ద పెద్ద కళ్ళతో, బెలచూపులు చూసేది. ఆ చూపులకు తన కోపం కరిగిపోయేది. మరుక్షణంలో ఆమె భయం తన బిగి కౌగిలిలో కరిగి జారిపోయేది.

నియాన్‌లైట్ల వెలుగులో ఎదురుగా ఉన్న గార్డెన్ రంగులహరివిల్లులా ఉంది. రామస్వామి కూర్చున్న బెంచీమీద మాత్రం చీకటిగా ఉంది. అది ఒక దట్టమైన చెట్టుమొదలును అనుకొని ఉంది.

ఎడంవైపున కొద్దిదూరంలో ఉన్న పొదమాటున ఏదో అలికిడిఅయింది. తల త్రిప్పిచూశాడు. క్రీనీడలో చెంగావి రంగు సిల్కుచీరా, వైట్‌షర్టూ కన్పించాయి.

ప్రేమికులులా ఉన్నారు అనుకున్నాడు.

"డార్లింగ్! అలా మూతి ముడుచుకొని కూర్చుంటే బొత్తిగా బాగాలేదు. ఇలారా!" గొంతు తగ్గించి అన్నది మగకంఠం. రామస్వామికి ఆ మాటలు విన్పించాయి. ఆఫీసులో అందరూ అతని చెవులు పాముచెవులు అనేవారు.

రామస్వామి చెవులు రిక్కించి విన సాగాడు.

"నీకేం మగవాడివి. నీ గొడవ నీది. నీకు కావాల్సింది ...."

"ఊ! నీ శరీరమేనంటావ్! ఓ డియర్! మరీ అంత పాతకాలపు డైలాగ్ విసిరేస్తే ఎలా? టేకిట్ ఈజీ! అయినా శరీరంలేని మనసును ఎవరు మాత్రం ఏంచేసుకుంటారు చెప్పు?"

"హాస్యాలకు సమయంకాదు. నేను సీరియస్‌గా మాట్లాడుతున్నాను." స్త్రీ కంఠం.

"ఓ! ఐసీ! ఇప్పటికి ఏన్నేం చెయ్యమంటావ్?" పురుషకంఠం సీరియస్‌గా అన్నది.

"మనం పెళ్లిచేసుకోవాలి."

"పెళ్లా? వాట్ ఏ జోక్!"

"జోక్‌కాదు. నిజంగానే అంటున్నాను."

"నాకు పెళ్లయిందని నీకూ తెలుసు! నేను నిన్ను మోసంచెయ్యలేదే? పెళ్లి కాలేదని చెప్పలేదే!"

"ప్లీజ్ అలా మాట్లాడకు. నాకు లీగల్ రైటు కావాలనడంలేదు." నీదాన్నిగా సమాజం ముందు నిలబెట్టు! అంతేచాలు."

"అంటే ఉంపుడుగత్తెగా ఉంటానంటావా? ఛ! ఛ! నువ్వు అందంగా ఉంటావ్! బాగా చదువుకున్నావ్! పెళ్లి చేసుకోవాలనిపిస్తే హాయిగా చేసుకొని—"

"నాకు మూడో నెలకూడా వచ్చింది."

"ప్ష్ అంతేగా? మధు దగ్గరకు వెళ్ళు. వాడు నాకు ప్రాణస్నేహితుడు. రేపు నేను ఫోన్‌చేస్తాను. రెండో కంటికి తెలియకుండా...."

స్త్రీ రోదనం! అది గాలిగా స్త్రీ గుండెల్ని చీల్చుకుంటూ వచ్చిన రోదనం!

రామస్వామి అక్కడ కూర్చోలేక పోయాడు.

"షావుకారుగారి బలిసిన ఎద్దు బక్క రైతు పంటచేను మేస్తున్నది." అనుకున్నాడు.

"ఓ డియర్! ఏడుపు ఆపు! నాకు ఏడ్చే ఆడవాళ్లంటే అసహ్యం అని నీకు తెలుసుగా! రా! ఇలా చూడు!" లాలింపు.

అది పాతపాటే! గబగబా బయటికి నడిచాడు రామస్వామి.

తనలో చురుకుతనం చావలేదు. తన వయసు నలభై ఐదు.

నలభై ఐదు. మగవాడికి పెద్దవయసు కాదు. ఆమాటకొస్తే ఈరోజుల్లో ఆడవాళ్ళే నలభైలో పెళ్లిళ్లుచేసుకుంటున్నారు. ఈ రోజుల్లో ముఖ్యంగా పట్నాల్లో నివసించేవాళ్లకు ముసలితనమే రావడంలేదు. గీత వయసు నలభై. తన కంటే నాలుగేళ్లు చిన్న.

రామస్వామికి తనలో చచ్చిపోయిందనుకున్న జంతువేదో కళ్ళు తెరిచినట్టు అనిపించింది. కొమ్ములు విసరడానికి సిద్ధంగా ఉన్నట్టుంది. ఇవ్వాళ దానిసంగతేదో తేల్చుకోవాలి అనుకున్నాడు.

తను తల్లిదండ్రుల ఇష్టానికి వ్యతిరేకంగా గీతను పెళ్లిచేసుకున్నాడు. కట్నం తీసుకోలేదు. బీదకుటుంబంలోనుంచి వచ్చింది. ఎం. ఏ. పాసయిన తనకు లక్షలు ఇచ్చి పిల్లనిస్తామని ఎందరో వచ్చారు. అయినా తనత్యాగాన్ని ఈనాడు గీత మర్చిపోయింది.

అసలు తనను ఇప్పుడు మనిషిగానే చూడటంలేదు. గొంగూరలోని పురుగును తీసేస్తుంది – అవమానిస్తున్నది.

రామస్వామి నడక వేగం పెరిగింది. ఇంటికివెళ్ళి గీతను రెండు చేతులతో పట్టుకొని ఊపేస్తూ "ఏమైంది నీకు? నన్నెందుకిలా అవమానిస్తున్నావ్?" అని అడగాలని నిర్ణయించుకున్నాడు.

ఈరోజు తను తాడోపేడో తేల్చుకుంటాడు! ఇంటికి చేరేసరికి పదకొండు గంటలైంది. గడపలో కాలు పెట్టి నిలబడిపోయాడు. మళ్లీ ఏదో పిరికితనం– కాని నిద్రలేచిన జంతువు ఆ పిరికితనాన్ని వెనక్కు నెట్టెయ్యడానికి ప్రయత్నిస్తోంది.

"ఆడపిల్ల సంపాదన తింటూ బలాదూర్ తిరిగే నువ్వేం మగవాడివి!" గీత ఎన్నోసార్లు అన్నమాటలు గుర్తొచ్చాయి.

లోపలి జంతువు పళ్లు నూరింది.

ఇవ్వాళ చూపిస్తాడు తన తడాకా!

తనను ఏమనుకుంటున్నది? మళ్లీ అంతలోనే తను గీతను ఏమీచెయ్యలేడు అని అనిపించింది అతనికి.

పెదవి గట్టిగా కొరుక్కున్నాడు. ఉప్పగా ఏదో తగిలింది. పెదవి చిట్లి రక్తంకారుతున్నది. నాలుకతో పెదవిని నాకాడు.

పక్కన ఏదో శబ్దం అయింది. తిరిగి చూశాడు.

వాకిలిముందు, దీపస్తంభం పక్కగా ఓ ముసలికుక్క ఎండిపోయిన ఎముకను కొరుకుతున్నది. దానికి పళ్లులేవు. ఆ ఎముకలో మూలిగలేదు. అయినా అది దాన్ని వదలడంలేదు. ఎముకను కొరుకుతుంటే దాని చిగుళ్లు చీరి రక్తం కారుతోంది. ఆ రక్తాన్ని చప్పరిస్తూ, ఎముకనుంచే తనకు ఆ రక్తం వస్తున్నదని భ్రమపడుతోంది.

తనూ అలాగే....

ఛ! ఇదేమిటి! తనను తాను ఆ ముసలికుక్కతో పోల్చుకుంటున్నాడు.

"ఏమిటి అక్కడే నిలబడిపోయారు?"

ఉల్లిపడి చూశాడు రామస్వామి.

తనకళ్ళను తనే నమ్మలేకపోయాడు. ఎదురుగా గీత. అవును తలుపులు రోజులా వేసిలేవు. తను ఆ సంగతికూడా గ్రహించలేదు.

"రాత్రి ఇంత పొద్దుపోయేదాకా తిరగాలా? అసలే రోజులు బాగాలేవు. రోజూ ఎక్కడోచోట యాక్సిడెంటు జరిగిందని వింటూనే ఉన్నాం."

గీతేనా మాట్లాడుతున్నది? తన భార్యేనా?

"అలాచూస్తారేం? రండి లోపలకు!"

రామస్వామి యాంత్రికంగా లోపలకు నడిచాడు.

"బట్టలు మార్చుకోండి, భోజనం వడ్డిస్తాను." గీత కంఠం మెత్తగా ఉన్నది.

"పిల్లలు నిద్రపోయారా?" ఆమె కళ్ళల్లోకి చూడకుండానే అడిగాడు.

"ఊఁ."

"నువ్వు భోజనం చేశావా?"

"లేదు."

"అరే! నాకోసం ఎదురుచూస్తున్నావా? నువ్వూ వడ్డించుకో." తలవంచుకుని అన్నం కలుపుకుంటూ అన్నాడు.

"నాకు ఆకలిగా లేదు. మీరు భోజనం చెయ్యండి."

రామస్వామి మళ్ళీ ఆ విషయం అనలేదు. తానుమాత్రం గబగబా తినేసి లేచాడు చాలాకాలానికి సంతృప్తిగా భోజనంచేశాడు. రోజూ పొద్దుపోయి వస్తాడు. అప్పటికి పిల్లలు నిద్రపోతారు. గీత నిద్రపోతుందో లేదో అతనికి తెలియదు. కాని తలుపు విసురుగాతీసి గిర్రున వెళ్ళిపోయి మునగదీసుకొని పిల్లలగదిలో పడుకుంటుంది. అతను వంటింట్లోకి వెళ్ళి గిన్నెలు వెతుక్కుంటాడు.


ఈరోజు తన భార్య తనకోసం ఎదురు చూడటం ఆశ్చర్యం కలిగించింది. సంతోషంగానూ ఉంది. భయంగానూ ఉంది.

మంచంమీద పడుకున్నాడు. గీతకోసం ఎదురుచూస్తున్నాడు. ఆమె తప్పక వస్తుందనిపిస్తోంది. అతనిలో నిద్ర మేల్కొన్న జంతువు అశాంతిగా కొమ్ములు విసురుతోంది.

ఇంకా రాలేదేం? రాకపోతే? ఎవరి కోసం వస్తుంది!

తను కొంచెం బెట్టుచేస్తే?

గీత వచ్చింది. భర్త పక్కన కూర్చుంది. రామస్వామి అది గమనించ




నట్టే కళ్ళుమూసుకుని నిద్రపోతున్నట్టు నటించసాగాడు.

"నిద్రపోతున్నారా?" నొసటిమీద చెయ్యివేసింది గీత. ఆ చెయ్యి చల్లగా ఉన్నది.

"ఊఁ ఏం?" కళ్ళుతెరుస్తూ అన్నాడు. ధైర్యంగా ఆమె కళ్ళలోకి చూశాడు. ఆ కళ్ళలో అదే శూన్యం- ఇసుక ఎడారిలోని శూన్యం. చెయ్యితీసేసి పక్కకు తిరిగి పడుకోవాలనుకున్నాడు. ఆమె నడుంమీద చెయ్యివేసి దగ్గరకు లాక్కున్నాడు. ఆమె గుండెలమీద వాలిపోయింది. అతని పెదవులు ఆమె పెదవుల్ని తాకబోయాయి. ఇంతలో "లావణ్య ఆరోగ్యం బాగాలేదు" అన్నది గీత.

"వాతావరణం మారిందిగా" గీతను దగ్గరగా తీసుకుంటూ అన్నాడు.

"అదికాదండీ!" నాకేదో భయంగా ఉంది - వాంతులుకూడా అవుతున్నాయ్" భర్తచేతిని తన నడుంమీద నుంచి తొలగిస్తూ అన్నది.

"ఓ రాణీ! నీకు అన్నీ భయాలే! కొన్ని జ్వరాలకు వాంతులు కూడా వస్తాయి. ఊరంతా జ్వరాలున్నాయ్." గీత చేతికిఉన్న మట్టిగాజుల్ని పైకి కిందకూ జరుపుతూ అన్నాడు.

"అయ్యోరాత! మీకు ఏదీ ఒక పట్టాన అర్థంకాదు. నాకు అనుమానంగా ఉంది. ముందే జాగ్రత్త పడకపోతే...."

రామస్వామి భార్యచెయ్యి వదిలేశాడు.

ఒక మంచుబండ తనను అనుకుని ఉన్నట్టనిపించింది. గీతను కిందకు తొయ్యాలనుకున్నాడు. చేతులు కదల్లేదు.

"మాట్లాడరేం!"

రామస్వామి చివ్వున లేచికూర్చున్నాడు. భార్యను ఒక్క తోపు తోశాననుకున్నాడు. కాని ఆమే లేచి నిల్చుంది, మంచం పక్కగా భర్తముఖంలోకి చూస్తూ.

"నన్నడుగుతావేం? వాణ్ణి- ఆ ఆఫీసరుగాణ్ణి ఇంట్లోచేర్చావ్- కాఫీలు ఇచ్చావ్- భోజనాలు పెట్టావ్- ఇవన్నీ నన్ను అడిగే చేశావా? నువ్వు.... ఒక తల్లిగా చెయ్యాల్సిందేమిటి? చేసిందేమిటి? వాడు దానికి ఉద్యోగం ఇచ్చాడనేగా! ఛ! నువ్వు ఆడదానివేనా?" అంటూ కోపంగా గీత కళ్ళల్లోకి చూశాడు.

గీత చూపుల్లో ఏముందో మళ్ళీ అతనిలో ఏదో చచ్చిపోయింది. ఢీలా పడిపోయాడు.

అతన్ని చూస్తూ గీత నవ్వింది.

మొనాలిసాలా నవ్వింది.

"నన్ను నిందిస్తున్నావా? ఆ ఉద్యోగం నువ్వు చూపిందే కదూ? అసలు వాడిని ఇంటికి తీసుకొచ్చింది నువ్వు కదూ? నీకు అంతా తెలుసు. తెలియనట్టే నటిస్తున్నావ్! ఆత్మ ద్రోహం చేసుకుంటున్నావ్! ఇప్పుడు నన్ను నిందిస్తున్నావ్!" ఆమె పైమాటలు అనలేదు.

ఆమె చూపులు నిలదీసి అడుగుతున్నాయ్.

ఆమె నవ్వి "నువ్వు కన్నతండ్రి వేనా? నువ్వు మగవాడివేనా?" అని అడుగుతోంది.

పక్కగదిలో లావణ్య వాంతిచేసుకుంటోంది.

"నువ్వు రాత్రిళ్ల అంతపొద్దుపోయే దాకా బజార్లలో బలాదూర్ ఎందుకు తిరుగుతున్నావో ఆలోచించుకో. నీకు ఏమీ తెలియనట్టు నటించి నన్ను మోసంచెయ్యాలనుకున్నావ్. కాని నీ అంతరాత్మనే నువ్వు మోసం చేసుకుంటున్నావ్!" ఎవరో ప్రశ్నిస్తున్నారు అంతరాంతరాలలోంచే రామస్వామిని.

మళ్ళీ పక్కగదిలో 'భళ్లున' వాంతి చేసుకున్నశబ్దం.

గీత బయటికి వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళినవైపే కళ్ళు అప్పగించి చూస్తూ నిల్చున్నాడు.

అతనికి శరీరంలో ఏదో గడ్డకట్టుకుపోతున్నట్టుగా ఉంది.

ఓపిలేక మంచంమీద కూలిపోయాడు.

కళ్ళు మూసుకున్నాడు,

అది పార్కు!

తను బెంచీమీద కూర్చున్నాడు.

పక్కనేఉన్న పొద కదిలింది.

పక్కకు తిరిగి చూశాడు.

కళ్ళముందు బాగా బలిసిన ఒక ఎద్దు!

పేదరైతు చేలో పడింది.

బీదవాడి బ్రతుకుపంటను తినేస్తుంది.

ఆ బక్కరైతు చూస్తున్నాడు. అసహాయంగా చూస్తున్నాడు. తను ఏమీ చెయ్యలేడు. అతనికి తెలుసు అందుకే చూస్తున్నాడు.

ఆ ఎద్దు షావుకారు గారిది.

షావుకారుతో పేచీ పెట్టుకుంటే తను బతకలేడు.

"ఎక్-కేక్" వాంతిచేసుకుంటున్నది లావణ్య.

రామస్వామి చివ్వున లేచి కూర్చున్నాడు. లావణ్యను ఆ చెంపా ఈ చెంపా వాయించాలనిపించింది. మంచం దిగబోయి ఆగిపోయాడు.

తను ఆ పని చెయ్యగలడా?

తనకు లావణ్యకు ఎదురుగా వెళ్ళే నైతికబలం ఉన్నదా!

లేదు! లేదు

కళ్ళముందు ముసలికుక్క—ఆ కుక్క నోట్లో ఎండిపోయిన ఎముక— దాని నోటిచివరినుంచి కారుతున్న ఎర్రటి రక్తం— ఆ రక్తాన్ని నాకటానికి బయటికి చాచిన పల్చటి నాలుక—

తనకంటే అదే నయం!

అది తన రక్తం తనే తాగుతోంది.

తన రక్తంతోనే తన పొట్ట నింపుకోవడానికి తాపత్రయపడుతోంది. దానికి ఆ విషయం తెలియదు.

కాని— మరి తనో!

తనకు అంతా తెలుసు!

తెలిసి తెలిసి ఏం చేశాడు?

ఈ ముద్దేళ్ళనుంచీ తనపొట్ట ఎవరి రక్తపు కూడుతో నింపుకుంటున్నాడు?

తను కన్నబిడ్డ రక్తంతో కలిపిన ముద్దలు తింటున్నాడు.

తనుఇంతకుముందేతిన్న ఆ అన్నం....

రామస్వామికి కడుపులో ఏదో కెలికినట్టు అయింది.

తలలో ఏదో ప్రేలింది.

దూరంగా కొండ పగిలి రాళ్ళు ఎగిరిపడ్తున్న శబ్దం.

గుండెలో అరణ్యం తగలబడిపోతున్నది.

ఏవో చిటపట ప్రేలుతున్నాయ్.

"నువ్వు చేసింది ఏమిటి?" ఎవరో అరుస్తున్నారు.

"నేనేం చేశాను?"

"మరెవరు చేశారు?"

"ఏమో!"

"కాదు -- నేను ఏమీ చెయ్యలేదు. ఎవరో నాచేత ఇలా చేయించారు. వాళ్ళెవరో నాకు తెలియదు. వాళ్ళు చాలామంది ఉన్నారు."

రామస్వామి చివ్వున లేచి మంచం దిగాడు.

అతనికంటే ముందే అతని నోటినుంచి వాంతి భళ్లున బయటికి దూకింది.

లావణ్య గది శుభ్రంచేసి, భర్త దగ్గరకు రాబోతూ గడపలోనే ఆగిపోయింది గీత.

